30-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - శుభకార్యంలో ఆలస్యం చేయకండి, తమ సోదరీ-సోదరులను ఎదురుదెబ్బలు తినడం నుండి రక్షించాలి, భూ-భూ చేసి తమ సమానంగా తయారుచేయాలి"

ప్రశ్న:- ఏ విషయములో అనర్థం జరగడం వలన భారత్ గవ్వతుల్యంగా అయిపోయింది?

జవాబు:- అన్నింటికన్నా పెద్ద అనర్థమేమి జరిగిందంటే - గీత యొక్క స్వామిని మర్చిపోయి, గీతా జ్ఞానం ద్వారా జన్మ తీసుకున్న బిడ్డను స్వామి అని అనేసారు. ఈ ఒక్క అనర్థము కారణంగానే అందరూ తండ్రి నుండి విముఖులుగా అయిపోయారు, భారత్ గవ్వతుల్యంగా అయిపోయింది. ఇప్పుడు పిల్లలైన మీరు తండ్రి సమ్ముఖంలో సత్యమైన గీతను వింటున్నారు, ఈ గీతా జ్ఞానము ద్వారానే దేవీ-దేవతా ధర్మము స్థాపన అవుతుంది, మీరు శ్రీకృష్ణుని సమానంగా అవుతారు.

పాట:- ఈ ఆటనంతా ఎవరు రచించారు... (కిస్నే యహ్ సబ్ ఖేల్ రచాయా...)

ఓం శాంతి. తప్పకుండా మాకు స్వర్గంలో అపారమైన సుఖముండేది, మేము చాలా సంతోషంగా ఉండేవారము, జీవాత్మలమైన మేము స్వర్గములో ఎంతో ఆనందంగా ఉండేవారము అని బ్రాహ్మణ కులభూషణులైన పిల్లలు అర్థం చేసుకున్నారు, మరి ఆ తర్వాత ఏం జరిగింది? రంగు-రూపము అనే మాయ వచ్చి అంటుకుంది. వికారాల కారణంగానే దీనిని నరకము అని అంటారు. మొత్తమంతా నరకమే. ఇప్పుడు భ్రమరము ఉదాహరణనేదైతే ఇస్తారో, ఆ భ్రమరము మరియు బ్రాహ్మణి ఇరువురి పనీ ఒక్కటే. భ్రమరము ఉదాహరణ మీకే వర్తిస్తుంది. భ్రమరము పురుగులను తీసుకువెళ్తుంది, ఇల్లు తయారుచేసి అందులో పురుగులను వేస్తుంది. ఇది కూడా నరకమే. అందరూ పురుగులే. కానీ అన్ని పురుగులు దేవీ-దేవతా ధర్మానికి చెందినవారు కారు. ఏ ధర్మానికి చెందినవారైనా సరే, అందరూ నరకవాసులైన పురుగులే. ఇప్పుడు దేవీ-దేవతా ధర్మానికి చెందిన పురుగులు ఎవరు. ఇక్కడ కూర్చుని భూ-భూ చేస్తున్నవారు ఆ బ్రహ్మా వంశీ బ్రాహ్మణీలు అన్నది ఎలా తెలుస్తుంది. ఎవరైతే దేవతా ధర్మానికి చెందినవారో, వారే నిలవగలుగుతారు. ఎవరైతే దేవతా ధర్మానికి చెందినవారు కారో, వారు నిలవరు. అందరూ నరకవాసులైన పురుగులే. సన్యాసులు కూడా - నరకములోని ఈ సుఖము కాకిరెట్టతో సమానమైనది అనే అంటారు. స్వర్గంలో అపారమైన సుఖముండేదని వారికి తెలియదు. ఇక్కడ 5 శాతము సుఖము మరియు 95 శాతము దుఃఖము ఉంది. కావున దీనిని స్వర్గము అనేమీ అనరు. స్వర్గంలోనైతే దుఃఖానికి సంబంధించిన విషయమే ఉండదు. ఇక్కడైతే అనేక శాస్త్రాలు, అనేక ధర్మాలు మరియు అనేక మతాలు ఉన్నాయి. స్వర్గంలోనైతే ఒకే అద్వైత దేవతా మతము ఉంది. ఒకే ధర్మం ఉంది. మీరు బ్రాహ్మణీలు. మీరు భూ-భూ చేస్తారు, అప్పుడు ఈ ధర్మానికి చెందినవారు ఎవరైతే ఉంటారో వారు నిలుస్తారు. అనేక రకాలవారు ఉన్నారు. కొందరు ప్రకృతిని నమ్ముతారు, కొందరు సైన్స్ ను నమ్ముతారు, మరికొందరు ఈ సృష్టి ఊహాజనితమైనది మాత్రమే అని అంటారు. ఇటువంటి సంభాషణ ఇక్కడే జరుగుతుంది, సత్యయుగంలో జరగదు. ఈ అనంతమైన తండ్రి ప్రజాపిత బ్రహ్మా ముఖ కమలం ద్వారా తమ పిల్లలకు కూర్చుని అర్థం చేయిస్తారు - మీరు నా వద్ద ఉండేవారు, ఇప్పుడు మళ్ళీ నా వద్దకు రావాలి. ఇందులో శాస్త్రాల ప్రస్తావన ఏమీ రాదు. క్రైస్టు మరియు బుద్ధుడు వస్తారు, వారు కూడా వచ్చి వినిపిస్తారు, ఆ సమయంలో శాస్త్రాలకు సంబంధించిన ప్రస్తావన రాదు. క్రైస్టు ఏమైనా బైబిల్ చదివేవారా? బైబిల్ యొక్క ప్రస్తావనే తలెత్తదు. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు మీ పరిస్థితిని చూడండి. మాయా రావణుడు మీ పరిస్థితిని ఎలా చేసాడు! మేము అసురీ రావణ సాంప్రదాయానికి చెందినవారము అని భావిస్తారు కూడా. రావణుడిని కాలుస్తారు కానీ అతడు కాలడు. రావణుడు కాలడము అనేది ఎప్పుడు సమాప్తం అవుతుంది? ఈ విషయం మనుష్యులకు తెలియదు. మీరు ఈశ్వరీయ దైవీ సాంప్రదాయం వారు. మీరు నా పిల్లలు, ఇప్పుడు నేను పిల్లలైన మీకు రాజయోగాన్ని నేర్పించేందుకు మళ్ళీ వచ్చాను. అనేక ధర్మాలు ఉన్నాయి. వాటి నుండి బయటకు తీయడానికి ఎంత కష్టపడవలసి వస్తుంది. గీత కూడా ఎక్కడి నుండి వచ్చింది? ఆది సనాతన ధర్మమేదైతే ఉండేదో, దాని గుర్తులు ఎక్కడి నుండి వెలువడ్డాయి? వాటిని ఋషులు, మునులు కూర్చుని తయారుచేసారు, వాటినే ఇప్పటివరకు వింటూ వచ్చారు. వేదాలను ఎవరు గానం చేసారు? వేదాలకు తండ్రి ఎవరు? తండ్రి అంటారు - గీతా భగవానుడిని నేను. గీతా మాతను రచించింది శివబాబా, ఆ గీత నుండి శ్రీకృష్ణుడు జన్మ తీసుకున్నారు. అతనితోపాటు రాధ మొదలైనవారంతా వస్తారు. మొదట ఉన్నది బ్రాహ్మణులు.

వారు మా అతి ప్రియమైన తండ్రి అని పిల్లలైన మీకు నిశ్చయముంది - వారిని అందరూ ఓ గాడ్ ఫాదర్, దయ చూపించండి అని అంటారు. దుఃఖము నుండి ఎలా విముక్తులవ్వాలి అంటూ భక్తులు పిలుస్తారు. ఒకవేళ భగవంతుడు సర్వవ్యాపి అయినట్లయితే ఇక పిలవాల్సిన అవసరమే లేదు. ముఖ్యమైనది గీతకు సంబంధించిన విషయము, ఎన్ని యజ్ఞాలు మొదలైనవి రచిస్తారు. ఇప్పుడు మీరు ఇటువంటి కరపత్రాలను ముద్రించండి. ఇప్పుడు ఎంతటి అనర్థం జరిగిపోయింది. ఎక్కడంటే అక్కడ గీతను వ్రాస్తూ ఉంటారు. గీతను ఎవరు రచించారు, ఎవరు గానం చేసారు, ఎప్పుడు గానం చేసారు, ఎవరు తయారుచేసారు, ఏమీ తెలియదు. శ్రీకృష్ణుని యథార్థ పరిచయం కూడా లేదు. కేవలం - ఎక్కడ చూసినా కృష్ణుడే కృష్ణుడు సర్వవ్యాపిగా ఉన్నారు అని అంటారు. రాధ భక్తులు రాధ గురించి - ఎక్కడ చూసినా రాధయే రాధ సర్వవ్యాపిగా ఉన్నారు అని అంటారు. అలా ఒక్క నిరాకారుడైన పరమాత్మను మాత్రమే సర్వవ్యాపి అన్నా పర్వాలేదు, అందరినీ ఎందుకు సర్వవ్యాపి చేసేసారు. గణేశుడి గురించి కూడా సర్వవ్యాపి అని అంటారు. ఒక్క మథురా నగరంలోనే కొందరు శ్రీకృష్ణుడు సర్వవ్యాపి అని అంటే, కొందరు రాధ సర్వవ్యాపి అని అంటారు. ఎంత తికమకలో ఉన్నారు. ఒకరి మతము ఇంకొకరితో కలవదు. ఒకే ఇంట్లో తండ్రికి ఉన్న గురువు పేరు, కొడుకుకు ఉన్న గురువు పేరు. వాస్తవానికి గురువులను వానప్రస్థంలో ఆశ్రయిస్తారు. తండ్రి అంటారు - నేను కూడా ఇతని వానప్రస్థావస్థలో వచ్చాను. ప్రపంచంలో ఎవరు ఎంత పెద్ద గురువు అయితే, అతనికి అంత నషా ఉంటుంది. ఆదిదేవ్ కు మహావీర్ అన్న పేరును కూడా ఇచ్చారు. హనుమంతుడిని కూడా మహావీర్ అని అంటారు. మహావీరులు శక్తులైన మీరే. దిల్వాడా మందిరంలో శక్తులను సింహంపై స్వారీ చేస్తున్నట్లు చూపిస్తారు మరియు పాండవులను ఏనుగులపై స్వారీ చేస్తున్నట్లు చూపిస్తారు. ఆ మందిరము చాలా యుక్తిగా తయారుచేయబడింది. అది అచ్చంగా మీ స్మృతిచిహ్నమే. మీ చిత్రాన్ని చూపించేందుకు మీరు ఆ సమయంలో ఉండరు. మందిరాలు ద్వాపరంలో తయారయ్యాయి, కావున మీ చిత్రాలు ఎక్కడి నుండి వస్తాయి. సేవ అయితే మీరు ఇప్పుడు చేస్తున్నారు. విషయాలన్నీ ఈ సమయానికి చెందినవే. వారు శాస్త్రాలను తర్వాత తయారుచేసారు. ఒకవేళ మనం గీత పేరును ప్రస్తావించకపోతే - ఇది ఏ కొత్త ధర్మమో తెలియదు అని మనుష్యులు భావిస్తారు. ఎంతగా కష్టపడవలసి ఉంటుంది. వారు ఈ ప్రపంచంలో కేవలం ధర్మ స్థాపన చేస్తారు. మిమ్మల్ని అయితే తండ్రి కొత్త ప్రపంచం కొరకు తయారుచేస్తున్నారు.

తండ్రి అంటారు - నా వంటి కర్తవ్యాన్ని ఎవ్వరూ చేయలేరు. పతితులందరినీ పావనంగా తయారుచేయవలసి ఉంటుంది. ఇప్పుడు పిల్లలైన మీరు వార్నింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. భారత్ లో ఎంతటి అనర్థం జరిగింది, దాని కారణంగానే భారత్ గవ్వతుల్యంగా అయ్యింది. తండ్రి గీత మాత ద్వారా శ్రీకృష్ణునికి జన్మనిచ్చారు, వారేమో శ్రీకృష్ణుడిని గీతకు స్వామిగా చేసేసారు. గీతకు స్వామి శివుడు, వారు గీత ద్వారా శ్రీకృష్ణుడికి జన్మనిచ్చారు. మీరందరూ సంజయులు, వినిపించేవారు ఒక్క శివబాబాయే. ప్రాచీన దేవీ-దేవతా ధర్మాన్ని రచించేవారు ఎవరు? ఈ విషయాలన్నింటినీ వ్రాయడానికి బుద్ధి కావాలి. గీత ద్వారా మనం జన్మ తీసుకుంటున్నాము. మమ్మా రాధగా మరియు వీరు శ్రీకృష్ణునిగా అవుతారు. ఇవి గుప్తమైన విషయాలు కదా. బ్రాహ్మణుల జన్మను ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. ఇది శ్రీకృష్ణుడు మరియు పరమాత్మకు సంబంధించిన విషయము. బ్రహ్మా, శ్రీకృష్ణుడు మరియు శివబాబా - ఈ విషయాలన్నీ గుహ్యమైనవి కదా. ఈ విషయాలను అర్థం చేసుకునేవారు చాలా వివేకవంతులై ఉండాలి. ఎవరి యోగమైతే పూర్తిగా ఉంటుందో, వారి బుద్ధి పారసంగా అవుతూ ఉంటుంది. భ్రమించేవారి బుద్ధిలో ఇది నిలవదు. బాబా పిల్లలైన మీకు ఎంత ఉన్నతమైన జ్ఞానాన్ని ఇస్తున్నారు. విద్యార్థులు తమ బుద్ధిని కూడా నడిపిస్తారు కదా. కావున ఇప్పుడు కూర్చొని వ్రాయండి. శుభకార్యంలో ఆలస్యం చేయకూడదు. సాగరుని పిల్లలైన మనము మన సోదరీ-సోదరులను రక్షించాలి. పాపం వారు ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. బి.కె.లు ఎంతగానో కష్టపడుతున్నారు, తప్పకుండా ఏదో విషయమైతే ఉండే ఉంటుంది అని అంటారు. లక్షలాది కరపత్రాలను ముద్రించి గీతా పాఠశాలలు మొదలైన స్థానాలలో పంచండి. భారత్ అవినాశీ ఖండము మరియు సర్వోత్తమ తీర్థ స్థానము. ఏ తండ్రి అయితే అందరికీ సద్గతిని ఇస్తారో, వారి తీర్థ స్థానాన్ని మాయం చేసేసారు, కావున మళ్ళీ వారి పేరును ప్రఖ్యాతం చేయాలి. పుష్పాలను అర్పించేందుకు యోగ్యమైనవారు ఒక్క శివుడే. మిగిలినదంతా వ్యర్థమే. గీతా పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. మీరు వేషాన్ని మార్చుకుని అక్కడకు వెళ్ళండి. అప్పుడు - వీరు బి.కె.లేమో అని భావిస్తారు. ఇటువంటి ప్రశ్నలను ఇంకెవ్వరూ అడగలేరు. అచ్ఛా!

శివబాబా కూర్చొని బ్రహ్మా తనువు ద్వారా ఈ విషయాలను అర్థం చేయిస్తారని మీరు భావిస్తారు. ఏ బాబా అయితే స్వర్గాధిపతులుగా తయారుచేస్తారో, వారు ఇప్పుడు వచ్చారు. ఎప్పటివరకైతే బ్రాహ్మణులుగా అవ్వరో, అప్పటివరకూ దేవతలుగా అవ్వలేరు. బ్రాహ్మణ కులము దేవతలకన్నా ఉన్నతమైనది. అందరి ఆత్మా పావనంగా అవుతుంది. మీరు

మళ్ళీ కొత్త ప్రపంచంలో పునర్జన్మ తీసుకుంటారు. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

రాత్రి క్లాసు **12-1-69**

పిల్లలైన మీరు ఒక్క తండ్రి స్మృతిలో కూర్చున్నారు, ఒక్కరి స్మృతిలో ఉండడము - దీనినే అవ్యభిచారీ స్మృతి అని అంటారు. ఒకవేళ ఇక్కడ కూర్చుని ఉన్నా ఇంకెవరి స్మృతి అయినా కలిగితే దానిని వ్యభిచారీ స్మృతి అని అంటారు. తినడము, తాగడము, ఉండడము అనేది ఒక ఇంటిలో ఉన్నవారితో చేస్తూ, స్మృతి మరొకరిని చేయడము అంటే అది మోసమవుతుంది. భక్తి కూడా ఎప్పటివరకైతే ఒక్క శివబాబాకు చేస్తారో, అప్పటివరకూ అది అవ్యభిచారీ భక్తి, తర్వాత ఇతరులను స్మృతి చేయడము అనేది వ్యభిచారి భక్తి అవుతుంది. ఇప్పుడు పిల్లలైన మీకు జ్ఞానం లభించింది. ఒక్క తండ్రి ఎంత అద్భుతము చేస్తారు! మనల్ని విశ్వాధిపతులుగా చేస్తారు. కావున ఆ ఒక్కరినే స్మృతి చేయాలి. నాకైతే ఒక్కరే ఉన్నారు. కానీ పిల్లలు - శివబాబా స్మృతిని మర్చిపోతున్నాము అని అంటారు. వాహ్! భక్తి మార్గంలోనైతే - మేము ఒక్కరికే భక్తి చేస్తాము అని అనేవారు. వారే పతిత-పావనుడు, ఇంకెవ్వరినీ పతిత-పావనుడు అని అనడం జరగదు. అలా ఒక్కరినే అంటారు. వారే ఉన్నతోన్నతమైనవారు. ఇప్పుడైతే భక్తి యొక్క విషయమే లేదు. పిల్లలకు జ్ఞానముంది. జ్ఞానసాగరుడిని స్మృతి చేయాలి. మీరు వస్తే మేము మిమ్మల్నే స్మృతి చేస్తాము అని భక్తి మార్గంలో అంటారు. కావున ఈ విషయాలను గుర్తు చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాలి - మేము ఒక్క తండ్రినే స్మృతి చేస్తున్నామా లేక అనేక మిత్ర-సంబంధీకులు మొదలైనవారిని స్మృతి చేస్తున్నామా? ఒక్క తండ్రితోనే మనసు పెట్టుకోవాలి. ఒకవేళ మనసు ఇంకెటువైపైనా వెళ్తే స్మృతి వ్యభిచారి అవుతుంది. తండ్రి అంటారు - పిల్లలూ, నన్నొక్కరినే స్మృతి చేయండి. మళ్ళీ అక్కడ మీకు దైవీ సంబంధీకులు లభిస్తారు. కొత్త ప్రపంచంలో అందరూ కొత్తవారు లభిస్తారు. కావున - మేము ఎవరిని స్మృతి చేస్తున్నాము అని మిమ్మల్ని మీరు పరిశీలించుకోవాలి. తండ్రి అంటారు - మీరు పారలౌకిక తండ్రినైన నన్ను స్మృతి చేయండి. నేనే పతిత-పావనుడిని. ప్రయత్నించి ఇతరవైపుల నుండి బుద్ధియోగాన్ని తొలగించి తండ్రిని స్మృతి చేయాలి. ఎంతగా స్మృతి చేస్తారో, అంతగా పాపాలు తొలగుతాయి. ఎంతగా మనం స్మృతి చేస్తామో, అంతగా బాబా కూడా స్మృతి చేస్తారని కాదు. బాబా ఏమైనా పాపాలను తొలగించుకునేది ఉందా. ఇప్పుడు పావనంగా అయ్యేందుకు మీరు ఇక్కడ కూర్చున్నారు. శివబాబా కూడా ఇక్కడే ఉన్నారు. వారికి తమదంటూ శరీరమైతే లేదు, వారు అప్పుగా తీసుకున్నారు. మీరు తండ్రితో ప్రతిజ్ఞ చేసి ఉన్నారు - బాబా, మీరు వచ్చినట్లయితే మేము మీ వారిగా అయి కొత్త ప్రపంచానికి యజమానులుగా అవుతాము. మీ హృదయాన్ని ప్రశ్నించుకుంటూ ఉండండి. బుద్ధియోగపు లింక్ ఘడియ-ఘడియ తండ్రి నుండి తెగిపోతుంది అనైతే మీకు తెలుసు. లింక్ తెగిపోతుంది, మళ్ళీ స్మృతి చేస్తారు, మళ్ళీ తెగిపోతుంది అని తండ్రికి తెలుసు. పిల్లలు నంబరువారుగా పురుషార్థమైతే చేస్తారు. మంచి రీతిలో స్మృతిలో ఉన్నట్లయితే ఈ వంశంలోకి వచ్చేస్తారు. మిమ్మల్ని మీరు పరిశీలించుకుంటూ ఉండండి, డైరీ పెట్టుకోండి. మొత్తం రోజంతటిలో మా బుద్ధియోగము ఎక్కడెక్కడికి వెళ్ళింది? అప్పుడు తండ్రి అర్థం చేయిస్తారు. ఆత్మలో మనస్సు, బుద్ధి ఏవైతే ఉన్నాయో, అవి పరిగెడుతూ ఉంటాయి. తండ్రి అంటారు, అలా పరిగెత్తడం వలన నష్టం కలుగుతుంది. నన్ను స్మృతి చేయడం వలన ఎంతో లాభముంది, మిగిలినదంతా నష్టమే నష్టము. ముఖ్యంగా ఒక్కరినే స్మృతి చేయాలి. మీ విషయంలో మీరు జాగ్రత్త వహించాలి, అడుగడుగులోనూ లాభము, అడుగడుగులోనూ నష్టము ఉంటుంది. 84 జన్మలు దేహధారులను స్మృతి చేస్తూ నష్టాన్నే పొందారు. ఒక్కొక్కరోజు గడుస్తూ 5000 సంవత్సరాలు గడిచిపోయాయి, నష్టమే కలిగింది, ఇప్పుడు తండ్రి స్మృతిలో ఉంటూ లాభం పొందాలి.

ఈ విధంగా విచార సాగర మంథనం చేసి జ్ఞాన రత్నాలను వెలికి తీయాలి, తండ్రి స్మృతిలో ఏకాగ్రచిత్తులై నిమగ్నమవ్వాలి. కొందరు పిల్లలకు గవ్వలు సంపాదించాలనే చింత ఉంటుంది. మాయ వ్యాపారాలు మొదలైనవాటి ఆలోచనలను తీసుకొస్తుంది. ధనవంతులకైతే ఎన్నో ఆలోచనలు వస్తాయి. బాబా ఏం చేయగలరు. బాబాకు ఎంత మంచి వ్యాపారము ఉండేది, ఎదురుదెబ్బలు మొదలైనవి తినాల్సిన అవసరమే ఉండేది కాదు. ఎవరైనా వ్యాపారి వస్తే నేను అడిగేవాడిని - నీవు వ్యాపారివా లేక ఏజంట్ వా (గత జీవితంలో). మీరు వ్యాపారాలు మొదలైనవి చేస్తూ బుద్ధియోగాన్ని తండ్రితో జోడించాలి. ఇప్పుడు కలియుగం పూర్తి అయి సత్యయుగం వస్తుంది. పతితులు సత్యయుగంలోకి వెళ్ళనే వెళ్ళరు. ఎంతగా స్మృతి చేస్తారో, అంతగా పవిత్రంగా అవుతారు. పవిత్రత వలన ధారణ బాగా జరుగుతుంది. పతితులు స్మృతి చేయలేరు, అలాగే ధారణ జరగదు. కొందరికి భాగ్యం అనుసారంగా సమయం

లభిస్తుంది, పురుషార్థం చేస్తారు, కొందరికి సమయమే లభించదు, అసలు స్మృతే చేయరు. కల్పక్రితం ఎవరెంత ప్రయత్నించారో, అంతే ప్రయత్నిస్తారు. ప్రతి ఒక్కరూ తమ విషయంలో తాము కష్టపడాలి. సంపాదనలో నష్టం కలిగితే, ఇంతకుముందు ఈశ్వరుడి ఇష్టము అని అనేవారు. ఇప్పుడేమో డ్రామా అని అంటారు. కల్పక్రితం ఏదైతే జరిగిందో, అదే జరుగుతుంది. ఇప్పుడు 4 గంటలు స్మృతి చేస్తే, మరుసటి కల్పంలో ఎక్కువగా చేస్తారని కాదు. అలా కాదు. శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఇప్పుడు పురుషార్థం చేస్తే కల్పకల్పము మంచి పురుషార్థము జరుగుతుంది. కావున చెక్ చేసుకోండి, బుద్ధి ఎక్కడెక్కడికి వెళ్తుంది. మల్ల యుద్ధంలో చాలా జాగ్రత్త వహిస్తారు. అచ్ఛా - ఆత్మిక పిల్లలకు ఆత్మిక బాప్ దాదాల ప్రియస్మృతులు, గుడ్ నైట్.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. వివేకవంతులుగా అయ్యేందుకు స్మృతి ద్వారా తమ బుద్ధిని పారసములా తయారుచేసుకోవాలి. బుద్ధిని అటూ-ఇటూ భ్రమింపజేయకూడదు. తండ్రి ఏదైతే వినిపిస్తారో, దాని గురించే ఆలోచించాలి.

2. భ్రమరములా అయి భూ-భూ చేసి నరకవాసులుగా అయిన పురుగులను దేవీ-దేవతలుగా తయారుచేసే సేవను చేయాలి. శుభకార్యంలో ఆలస్యం చేయకూడదు. తమ సోదరీ-సోదరులను రక్షించాలి.

వరదానము:- సమానతా భావనను ఉంచుతూ కూడా, ప్రతి అడుగులోనూ విశేషతను అనుభవము చేయించే విశేష ఆత్మ భవ

పిల్లలు ప్రతి ఒక్కరిలో తమ-తమ విశేషతలు ఉన్నాయి. విశేష ఆత్మల కర్మలు సాధారణ ఆత్మలకన్నా భిన్నంగా ఉంటాయి. ప్రతి ఒక్కరి పట్ల సమానతా భావననే ఉంచాలి, కానీ వీరు విశేష ఆత్మలు అన్నది కనిపించాలి. విశేష ఆత్మలు అనగా విశేషముగా చేసేవారు, అంతేకానీ కేవలం మాట్లాడేవారు కాదు. వారి ద్వారా అందరికీ - వీరు స్నేహము యొక్క భండారము అన్న ఫీలింగ్ కలుగుతుంది, ప్రతి అడుగులోనూ, ప్రతి దృష్టిలోనూ స్నేహము అనుభవమవ్వాలి - ఇదే కదా విశేషత.

స్లోగన్:- ఈ సృష్టి వినాశనము కన్నా ముందే మీ లోపాలను మరియు బలహీనతలను వినాశనము చేయండి.